# ప్రగతి పథంలో నల్లకుంటబోలు

ప్రగతి పథంలో నల్లకుంటబోలు

నూతన పంచాయతీ ఏర్పాటుతో సమస్యల పరిష్కారం

ప్రభుత్వ నిధులు సద్వినియోగం

పల్లెప్రగతితో మారిన రూపురేఖలు



కట్టంగూర్: నల్లకుంటబోలులో ఇటీవల వేసిన సీసీ రోడ్డు

కట్టంగూర్, అక్టోబర్ 12: రాష్ట్ర ప్రభుత్వ పల్లెల అభివృద్ధికి చేపట్టిన పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారుపోయాయి. పల్లె ప్రగతితో భారీగా నిధులు మంజూరు చేయడంతో ప్రతి పైసాను ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పథంలో ముందు కెళ్తున్నారు. మండలంలోని నారెగూడెం గ్రామానికి అనుబంధంగా ఉన్న నల్లకుంటబోలు గ్రామాన్ని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. దీంతో 600 జనాభా ఉన్న గ్రామంలో ప్రభుత్వం నిర్వహించే పల్లెప్రగతి నిధులతో అభివృద్ధి పనులను చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం చిన్న గ్రామాలను పంచాయతీలుగా మార్చి తరువాత గ్రామ రూపు రేఖలే మారిపోయాయి.




గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం

### గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు..

గ్రామంలో వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణం 90 నుంచి వంద శాతం పూర్తయ్యాయి. రూ.12.60 లక్షలతో వైకుంఠధామం నిర్మించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. రూ.2.4 0 లక్షలతో సెగ్రిగేషన్ షెడ్డు, రూ.3 లక్షలతో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి 1300 మొక్కలను నాటారు. ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్‌తో గ్రామ అవసరాల కోసం వాడుతున్నారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్థంబాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని పాతి వైర్లను గుంచి లైట్లను ఏర్పాటు చేశారు. హరితహారంలో భాగంగా రోడ్లకు, ప్రతి వీధికి ఇరువైపుల సుమారు 800 మొక్కలు నాటారు. ప్రతి ఇంటికి 6 రకాల పూల, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.

## ప్రత్యేక పంచాయతీతోనే అభివృద్ధి



గ్రామస్తులు, అధికారుల సహకారంతో పల్లెప్రగతితో గ్రామం చాలా అభివృద్ధి జరిగింది. గ్రామంలో పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, వైకుంఠధామ నిర్మాణాలు పూర్తయ్యాయి. గ్రామంలో 90 శాతం సీసీ రోడ్లు, ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించాం. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి పైసను ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి కేటాయిస్తున్నాం. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సహకారంతో ప్రజల సమస్యలు తీర్చి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నం.

–పొన్నబోయిన లింగమ్మాశ్రీను, సర్పంచ్

## మా ఇబ్బందులు తీరాయి



పల్లెప్రగతి ద్వారా గ్రామంలో అభివృద్ధి జరిగింది. గ్రామపంచాయతీ ఏర్పాటు చేయక ముందు గ్రామస్తులు నాలుగు కిలోమీటర్ల ఉన్న నారెగూడేనికి రేషన్ సరుకుల కోసం వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలతో గ్రామంలో అభివృద్ధిలో ముందుకెళ్తుంది. గ్రామంలో సీసీ రోడ్లు, మురుగుకాల్వ నిర్మించారు. నూతన గ్రామం పంచాయతీగా ఏర్పాటు చేయడంతో బాధలు తీరాయి. గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వానికి ఎల్లప్పుడు రుణపడి ఉంటాం

– బండి లింగయ్య గ్రామస్తుడు

## పలు కుటుంబాలకు ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

నకిరేకల్, అక్టోబర్ 12 : నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన అబ్బగోని ఎల్లమ్మ, మర్రూర్ గ్రామానికి చెందిన నకిరేకంటి భిక్షమయ్య గురువారం అనారోగ్యంతో మరణించారు. వారి మృతదేహాలకు ఎమ్మెల్యే చిరుమర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు ఉన్నారు.

## కేంద్ర ఉపకార వేతనానికి నకిరేకల్ జూనియర్ కళాశాల విద్యార్థుల ఎంపిక

నకిరేకల్, అక్టోబర్ 12 : కేంద్ర ఉపకార వేతనానికి నకిరేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2023 ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పెండ్యాల మహేశ్వరి, సుంకరి ఉదయశ్రీ, నర్సాంగి లలిత కేంద్ర విద్యాశాఖ ప్రతి సంవత్సరం అందించే జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి డిగ్రీలో ప్రతి సంవత్సరం రూ. 10 వేలు, పీజీ స్థాయిలో ప్రతి సంవత్సరం రూ.20 వేలు ఉపకార వేతనం అందనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ఉరేసుకొని ఆర్టీసీ డ్రైవర్ మృతి

చిట్యాల, అక్టోబర్ 12 : మండల కేంద్రంలో గురువారం ఉరేసుకొని ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాలకు చెందిన ఏళ్ల బయ్యన్న(56) హైదరాబాద్ మిథాని డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 8 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో చికిత్స పొందుతూ ఇంటి వదే ఉంటున్నాడు. డ్యూటీ వెళ్లకపోవడంతో జీతం కూడ రావడం లేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 11న మధ్యాహ్నా లారీ అసోసియేషన్ వద్దకు వెళ్లి వస్తానని భార్యతో చెప్పి వెళ్లాడు. కానీ రాత్రి వరకు తిరిగి రాలేదు. ఆయన కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం లారీ కార్యాలయం వద్ద గల వేపచెట్టుకు బెల్టుతో ఉరేసుకొని ఉన్న బయ్యన్న మృతదేహాన్ని గుర్తించారు. బయ్యన్న భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



జాతీయ స్థాయి హాకీ పోటీలకుఎంపికైన క్రీడాకారులు

## జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

నల్లగొండ రూరల్, అక్టోబర్ 12 : ఈ నెల 17 నుంచి 24 వరకు చెన్నైలో జరిగే సౌత్ జోన్ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్ కరీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర విభాగంలో కుంచెం రాకేశ్ ,గోగుల అఖిల్, ధీరావత్ శంకర్, బాలికల విభాగంలో యాదాద్రి భువనగిరి జిల్లా లప్పనాయక్ తండాకు చెందిన ధీరావత్ ఝాన్సీ ,చౌటుప్పల్ కేజీబీవీ విద్యార్థినులు గునగంటి సిరి, వరికుప్పల లిఖిత, ఉయ్యాల సిరి, స్పందన, నల్ల ప్రీతి ,మట్టపల్లి శివాని ఎంపికైనట్లు పేర్కొన్నారు. డీఎస్‌డీఓ మగ్బూల్ అహ్మ ద్, కిరణ్ కుమార్ గౌడ్, శ్రీనివాస్‌లు, హాకీ కోచ్‌లు యావర్ హర్షం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

## సంక్షేమ పథకాలు ఇంటింటికీ వివరించాలి

- ముఖ్యకార్యకర్తల సమావేశంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి, అక్టోబర్ 12 : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి వెల్లి తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని నక్కలపల్లి గ్రామంలో గురువారం ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి సీఎం కావాలని అందుకు ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. నకిరకేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈద మాధవీనర్సింహ, ఎంపీటీసీ కనుకు అంజయ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



శాలిగౌరారంలో మాట్లాడుతున్న వెంకన్నగౌడ్

## ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకన్నగౌడ్

శాలిగౌరారం, అక్టోబర్12 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను హ్యాట్రిక్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం మండలంలోని బీఆర్ఎస్ బూత్ కమిటీల ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ వివరించి గ్రామంలో పర్యటించాలని విజ్ఞప్తి చేశారు. గెలుపు కోసం విధి విధానాలను వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అనిత, మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి, కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, నూక సత్తయ్యయాదవ్, గ్రంధాలయ చైర్మెన్ కంభాలపెల్లి కృష్ణ, గంట శంకర్, గుజిలాల్ శేఖర్‌బాబు, కొన్‌రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు కల్లూరి నాగరాజుగౌడ్, దుబ్బ వెంకన్న, సుల్తాన్ ఎల్లయ్య, దాసరి వెంకన్న, మామిడి రమేశ్, దాసరి నథానియల్, మహేశ్వరం వెంకన్న పాల్గొన్నారు.

## 'ఎమ్మెల్యే చిరుమర్తి గెలుపు కోసం కృషి చేయాలి'

చిట్యాల, అక్టోబర్ 12 : ప్రతి కార్యకర్త బూత్ స్థాయి నుంచి అందరిని కలుపుకొని వచ్చే ఎన్నికల్లో చిరుమర్తి లింగయ్యను ఎమ్మెల్యేగా గెలిపించడానికి కృషి చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయిలయ్య, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, నాయకులు కొలను వెంకటేశ్,యాదగిరి పిలుపునిచ్చారు. మండలంలోని వట్టిమర్తి నేరడ, ఉరుమడ్ల, చిన్నకాపర్తి, బోయగుబ్బ గ్రామాల్లో గురువాం బూత్ కమిటీల బాధ్యులను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ద్వార చిరుమర్తి గెలుపు కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెద్దబోయిన సత్తయ్య, వెలిమినేడు సింగిల్ విండో చైర్మన్ రుద్రారం భిక్షపతి, మర్ల రాంరెడ్డి, బోయపల్లి శ్రీనివాస్, ఉప్పరబోయిన స్వామి, బాతరాజు రవీందర్, తుమ్మల నాగరాజురెడ్డి, యాకారి నరేందర్, మేడి రాజు, నర్ర శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



వట్టిమర్తిలో బూత్ కమిటీ బాధ్యులతో బీఆర్ఎస్ నాయకులు